క్లుప్తంగా

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



బీడీ కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్ : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరైనా ఉపేక్షించేది లేదని డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. ఆయన ఆదివారం సీఐ బాబి, పెళ్లకూరు, ఓజిలి ఎస్ఐలు అజయ్ కుమార్, స్వప్న, పోలీసులతో కలిసి నాయుడుపేట పట్టణంలోని ఎల్ఏ సాగరం బీడీ కాలనీలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. కాలనీలో అనుమానిత వ్యక్తుల గురించి ఆరా తీశారు. అక్రమంగా మద్యం, గంజాయి విక్రయాలు జరుపుతున్నారా, ఇళ్ల వద్ద ఉన్న వాహనాలకు రికార్డులు ఉన్నాయా లేదా తదితర వివరాలను సేకరించారు. రికార్డులు లేని 25 వరకు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, పెళ్లకూరు తదితర పోలీస్ స్టేషన్ల ఏఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

గంగమ్మకు పొంగళ్లు



గంగమ్మకు పొంగళ్లు పెట్టేందుకు సామగ్రి తీసుకెళుతున్న మహిళలు

రాపూరు: మండలంలోని రామిరెడ్డిపల్లిలో ఆదివారం గంగమ్మకు గ్రామ పొంగళ్లు పెట్టారు. ముందుగా గంగమ్మకు పొంగళ్లకు కావాల్సిన సామగ్రిని బుట్టలో ఉంచుకుని వాటిని తలపై పెట్టుకుని మేళతాళాలతో గంగమ్మ చెట్టు వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి సారె, చీరలు సమర్పించారు. పొంగళ్లు పెట్టారు.

30 ఏళ్లనాటి రచ్చబండ ధ్వంసం

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో 30 సంవత్సరాలుగా ఉన్న రచ్చబండను ఆదివారం టీడీపీ నేతలు నేలమట్టం చేశారు. రచ్చబండపై వృద్ధులు, చిన్నపిల్లలు సేదతీరేవారు. స్థానిక టీడీపీ నేతలు రచ్చబండను ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



కూరగాయలు పంపిణీ చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరు రూరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో 20 మంది దివ్యాంగులకు కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. వాటిని గుర్రం విజయబాబు అందజేశారు. మయూరి శ్యామ్ యాదవ్ ఆయన మాట్లాడుతూ జేవీవీ మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించడమే కాకుండా ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, మూముడూరు రాదయ్య, మధుసూదన్, పవన్‌కుమార్ సుబ్రమణ్యం శ్రీనివాసాచారి, జగదీష్, సురేష్, జానా సుధీర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురికి గాయాలు

చిల్లకూరు : కడివేడు సమీపంలో ఆదివారం వినాయక చవితి నిమ్మజనం కోసం వెళ్లి తిరిగి వస్తున్న భక్తులు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తాపడడంతో ఆరుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గూడూరు మండలం చెన్నూరులోని చిరంజీవి నగర్‌కు చెందిన గిరిజనులు 25 మంది ట్రాక్టర్‌లో వినాయకుడి విగ్రహాన్ని తీసుకుని వాకాడు మండలం తూపిలిపాళెంలోని సముద్రం వద్ద నిమ్మజనం చేశారు. అనంతరం అందరూ ట్రాక్టర్‌లో బయలుదేరారు. కడివేడు సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. దీంతో సునీత, రవి, రమణమ్మ, పరిమళ, వెంకటరమణయ్య, శివ గాయపడ్డారు. వారిని 108 వాహనాల్లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆదిశంకరలో భారత టెక్ లీగ్ జోనల్ ఈవెంట్

గూడూరు రూరల్ : గూడూరు పట్టణ సమీపంలో ఉన్న ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఇంజినీర్స్ డే సందర్భంగా భారత్ టెక్ లీగ్ జోనల్ మీట్ నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా డీఎస్‌వో కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు అటల్‌టింకరింగ్ ల్యాబ్ ఉపయోగపడుతుందన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారు ఈనెల 22న విశాఖపట్నంలోని ఆంధ్రా వర్సిటీలో జరగనున్న నేషనల్ ఈవెంట్‌కు ఎంపికవుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుమాధవ్, సీఈవో ఇమ్మానుయేలు, కళాశాల వైస్ చైర్మన్ వంకి అనుషా, ఏవో రామయ్య, ప్రదీప్, కార్తీక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాల్సింది ప్రభుత్వమే



మెడికల్ కళాశాలలో బోధనతో పాటు విద్యార్థులకు వసతులు కల్పించాల్సింది ప్రభుత్వమే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఐదు కళాశాలల్లో సీట్లను భర్తీ చేసి బోధనను ప్రారంభించింది. ప్రస్తుతం ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే విద్యార్థులకు వసతులు లేవు అని చెబుతున్నారు. వసతులు కల్పించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేస్తే ఎలా. ప్రభుత్వ కళాశాలలను నడిపించాలి. **- చిల్లకూరు వేమయ్య, విద్యార్థి తండ్రి, చిల్లకూరు మండలం**



మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. అందులో ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు పూర్తి చేసి తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. వాటిని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఆ పని చేయకుండా ప్రైవేట్ పరం చేయాలని ప్రస్తుత ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ఈ క్రమంలోనే మంత్రి సత్యకుమార్ జగన్‌పై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.
- ఎం.శ్రీనివాసులు, విద్యార్థి తండ్రి, వెంకటగిరి

ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు



అరవపెరిమిడి చెరువు నుంచి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు



మట్టి తరలింపుతో చెరువులో ఏర్పడిన గుంతలు

- చెరువుల్లో రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు
- బరితెగించిన అధికార పార్టీ నేతలు
- పట్టించుకోని అధికారులు

టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుకుని చెలరేగిపోతున్నారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. వారి కన్ను చెరువులపై పడింది. జేసీబీలు, హిటాచీలతో చెరువుల్లో మట్టిని తవ్వి యథేచ్ఛగా తరలిస్తూ రూ. లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

- నాయుడుపేట టౌన్

మేనకూరు సెజ్‌లో అనేక పరిశ్రమలు ఏర్పాటువుతున్నాయి. వాటిలో పనిచేసే కార్మికులు సమీపంలోని నాయుడుపేట పట్టణంలో నివాసాలు ఏర్పరుచుకుంటున్నారు. అంతేగాక గ్రామాలకు చెందిన కొంతమంది తమ పిల్లల చదువుల కోసం పట్టణానికి వలస వస్తున్నారు. ఈ క్రమంలో నాయుడుపేట రోజురోజుకూ విస్తరిస్తోంది. ఇక్కడ స్థలాలకు డిమాండ్ పెరిగింది. ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేవుట్లు వేస్తున్నారు. దీంతో గ్రావెల్‌కు డిమాండ్ నెలకొంది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది అధికార పార్టీ నాయకులు నాయుడుపేట మండలంలో అరవపెరిమిడి, పుదూరు, పూడేరు తదితర ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. మమ్మల్ని అడిగే వారెవరు అంటూ రాత్రి, పగలు తేడాలేకుండా చెరువుల్లో జేసీబీ, హిటాచీలతో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. అదేవిధంగా నాయుడుపేట మండలం అయ్యప్పరెడ్డి పాళెం, పండ్లూరు, మేనకూరు, ఇంకా పలు ప్రాంతాల్లో మట్టి, ఇసుక అక్రమ తరలింపులు సైతం జోరందుకున్నాయి. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి గ్రావెల్, మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలోని అరవపెరిమిడి చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలింపులు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. వీఆర్వోను పంపి చెరువులో తవ్వకాలు చేసే వాహనాలను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తాం.
- గీతావాణి తహసీల్దారు, నాయుడుపేట

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వాకాడులోని తన స్వగృహంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తద్వారా పార్టీ బలోపేతం చేయాలన్నారు. వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, సర్పంచులు సిద్దారెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉప సర్పంచి పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నేదురుమల్లి హికుమార్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, దువ్వూరు భార్గవ్‌రామ, ఏనుగు సుధాకర్ నాయుడు, యల్లంటి శివారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు మార్గదర్శకుడు మోక్షగుండం



వాకాడు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



గూడూరు రూరల్ : ఇంజినీర్లను సత్కరిస్తున్న సీనియర్ ఇంజినీర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు

వాకాడు : భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశంలోని ఇంజినీర్లకు మార్గ నిర్దేశకుడని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వాకాడులోని తన నివాసంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు.

కోటలో..

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఆదివారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నేటి ఇంజినీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం ఆదర్శం కావాలన్నారు. ఆయన చేపట్టిన ప్రాజెక్టులు శాశ్వతంగా ఉంటాయన్నారు. శ్రీనివాస్, సీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా ఇంజినీర్స్ డేను జరుపుకున్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నిడిగంటి సుధాకర్‌నాయుడు, సభ్యులు బీకే ప్రసాద్, చెంగల్రాయులు, సతీష్, విజయ్‌కుమార్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షులు మల్లమ్మ, మాధవి పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఆదివారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంజినీర్లను సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, పీఆర్‌ఈఈ రవీంద్రబాబు, షేక్ రియాజ్ అహ్మద్, ఎల్.ప్రసాద్, మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్, బ్రహ్మదేవి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి విగ్రహం ఊరేగింపు



వేలం పాటలో దక్కించుకున్న లడ్డూను అందజేస్తున్న కమిటీ సభ్యులు



శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో విఘ్నేశ్వరుడి గ్రామోత్సవం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం దర్గా వీధిలో ఏర్పాటుచేసిన 22 అడుగుల వినాయకుడి విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్రేన్‌తో విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు స్వామి వద్ద ఏర్పాటుచేసిన లడ్డూను వేలం వేశారు. కూరపాటి కల్యాణ్‌రెడ్డి రూ.2,02,116లకు దక్కించుకున్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సహకరించిన దాతలకు వినాయకుని చిత్రపటాలు అందజేసి సత్కరించారు. అనంతరం విగ్రహాన్ని ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. కమిటీ సభ్యులు పొట్లాపోడి రాజేష్, భారతాల సాయిరామ్ కిషోర్ పాల్గొన్నారు.

వేడుకగా గణనాథుడి గ్రామోత్సవం

కోట: స్థానిక శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం వద్ద చివరి రోజు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గణనాథుడి గ్రామోత్సవం వేడుకగా చేపట్టారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, ఆటలు, పాటలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి.అనంతరం స్వామి వారిని నిమజ్జనానికి తరలించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జరనల్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగ ణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు సౌజన్యంతో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల వైద్యులు 160 మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 40 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామానాయుడు, ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొరవారిసత్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోగిలి జయరామరెడ్డి చారిటబుల్ సొసైటీ సహకారంతో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 150 మందికి పైగా పరీక్షలు చేసుకునానరు. వీరిలో 50 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గూడూరు రూరల్ : గూడూరు మండలం చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం చెన్నూరు సమీపంలో ఉన్న కట్టాలమ్మ ఆలయం కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనియన్‌గా ఏర్పడి ప్రతి ఏటా సమావేశమై పాఠశాలకు తోడ్పాటు అందించాలని తీర్మానం చేసారు.

తప్పుడు కేసులతో వేధిస్తున్నాడని ఫిర్యాదు



సీఐ ఏవీ రమణతో మాట్లాడుతున్న బాధితులు

వెంకటగిరి రూరల్ : అంగవైకల్యం కలిగిన వ్యక్తి చట్టాలలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని తమను డబ్బులు డిమాండ్ చేస్తూ తప్పుడు కేసులు పెడుతున్నాడని పలువురు వాపోయారు. వారు ఆదివారం వెంకటగిరి సీఐ ఏవీ రమణకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఓజిలి మండలం లింగారెడ్డి గ్రామానికి చెందిన దాసరపల్లి వెంకటరమణయ్య (వికలాంగుడు) కొన్నేళ్ల క్రితం బాలాయపల్లి మండలం కామకూరు దళితవాడలో వివాహం చేసుకుని అక్కడే ఉంటున్నాడని తెలిపారు. సులభంగా డబ్బు సంపాదనకు అలవాటు పడి కామకూరు, జయంపు, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు మహిళలను మానసికంగా ఇబ్బందులకు గురి చేసి డబ్బు డిమాండ్ చేశాడని తెలిపారు. తిరగబడిన వారిపై 47 తప్పుడు కేసులు పెట్టాడని వాపోయారు. అంతేగాక కొంతమందితో ముఠాను ఏర్పాటుచేసుకుని గ్రామాల్లోని బర్రెలు, గొర్రెలను చోరీ చేయిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై ప్రశ్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి డబ్బు డిమాండ్ చేస్తున్నాడని వాపోయారు. ఇప్పటి వరకు సుమారు 200 కేసులు పెట్టినట్టు తెలిపారు. విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలో ఆదివారం స్కూటర్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరుకు చెందిన పూనమాంగాడు జయచంద్ర సొంత పని నిమిత్తం పెళ్లకూరు వచ్చాడు. పనులు ముగించుకుని వెళుతుండగా తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన జయచంద్రను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తీసుకెళ్లారు. ఎస్ఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19న మత్స్య సహకార సంఘం మహాజన సభ

కలువాయి: కలువాయి చెరువు మత్స్యకారుల సహకార సంఘం మహాజన సభను 19వ తేదీ ఉదయం 11 గంటలకు కలువాయి అంకమ్మతల్లి గుడి వద్ద నిర్వహించనున్నట్టు కావలి మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎస్.శ్రీనివాసులు తెలిపారు. సంఘం పరిధిలోని కలువాయి, బ్రాహ్మణపల్లి, బద్దెవోలు, సీతారామపల్లి, రామన్నగారిపల్లిలోని సొసైటీ సభ్యులు తప్పక హాజరుకావాలని వెల్లడించారు. 2022లో సంఘానికి ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని విషయాలపై సభలో చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

బంగారు నగలు, నగదు చోరీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ఒక ఇంట్లో 7వ తేదీ రాత్రి గుర్తు తెలియని దుండగుడు బంగారు నగలు, నగదు, ల్యాప్‌టాప్ చోరీ చేశాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఉంటున్న తిరుపాల్ 7వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోకి చొరబడి బీరువాలో ఉంచిన 8 సవర్ల బంగారు నగలు, రూ.10 వేల నగదు, ల్యాప్‌టాప్‌ను చోరీ చేశాడు. బాధితుడు తిరుపాల్ ఈ నెల 8వ తేదీ ఉదయం గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు ఆదివారం తెలిపారు.

కండలేరులో 12.961 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 12.961 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,100 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 170, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలి

చిల్లకూరు : గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలని వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తమ్మినపట్నంలోని జిందాల్ పవర్ పరిశ్రమ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో గెలుపొందిన మూడు జట్లకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వాలీబాల్ పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. తమ్మినపట్నంలోని రెండు జట్లు తొలి రెండు బహుమతులు సాధించారని, మూడో బహుమతిని గుమ్మళ్లదిబ్బ జట్టు సొంతం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం జట్టు సభ్యులకు నగదు బహుమతులు అందజేశారు. పరిశ్రమ ప్రతినిధులు శ్రీనివాసరావు, మ్యాథ్యూ, ఖలీద్, గ్రామ సర్పంచ్ లావణ్య, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

చిల్లకూరు : మండలంలోని ముత్యాలపాడులో ఆదివారం మహిళపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. ముత్యాలపాడుకు చెందిన ప్రతిభ అనే మహిళ ఇంటి వద్ద ఉండగా గతంలో జరిగిన చిన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అదే గ్రామానికి చెందిన తేజ, పరుశురాముడు, సురేంద్ర దాడి చేశారు. గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులకు అవార్డులు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

నాయుడుపేట టౌన్ : ఉత్తమ సేవలు అందించిన నాయుడుపేట ప్రాంతానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. తిరుపతి విశ్వం విద్యాసంస్థలో ఆదివారం తిరుపతికి యువతేజం ట్రస్టు, కలాం విజన్ సంస్థ సౌజన్యంతో ఆచార్య దేవోభావ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయుడుపేట, సూళ్లూరుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల ప్రిన్సిపాళ్లు రూత్ రమోల, పి.గురు ప్రసూన, అధ్యాపకురాలు తస్నీరు శశికళ, పుదూరు పాఠశాల ఉపాధ్యాయురాలు పి.శ్రీదేవి, మునిరత్నంనగర్ పాఠశాల ఉపాధ్యాయుడు వి.సురేష్, తాళ్వాయిపాడు పాఠశాల హెచ్‌ఎం కె.దొరస్వామికి అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు.


25 మంది నేత్రదానం



నేత్రదానానికి ముందుకు వచ్చిన యువకులు

కలువాయి: కలువాయిలో 25 మంది యువకులు నేత్రదానం చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కలువాయి సబ్ బ్రాంచ్ చైర్మన్ జి.పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో నేత్రదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది యువకులు నేత్రదానం చేసేందుకు అంగీకరాం తెలిపారు. నెల్లూరు జీజీహెచ్ ఆస్పత్రి ఆప్తమాలజిస్టు డాక్టర్ పి.శైలజ వారి నుంచి అంగీకార పత్రాలు స్వీకరించారు. చనిపోయిన తర్వాత మూడు నుంచి ఆరు గంటలలోపు తమకు సమాచారం ఇస్తే నేత్రాలు సేకరించి అవసరమైన వారికి అమర్చుతామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ ఎం.రాంబాబు, ఏ.మల్లికార్జునయ్య, ఎం.చిన్నయ్య, నరేష్, శ్రీనివాసులు, దయాకర్, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల సాయం



చెక్కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి శిల్పా ప్రియాంక

గూడూరు రూరల్ : చిట్టమూరు మండలంలోని ఓ పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం ఏపీ ఆర్‌డీ సంస్థ ద్వారా రూ.10 లక్షల సాయం అందింది. ఈ మేరకు ఆదివారం చెక్కును ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అందజేశారు. గత ఏడాది తుపాను కారణంగా కురిసిన భారీ వర్షానికి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ క్రమంలో ఏపీఆర్‌డీ సంస్థ బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. సంస్థ ప్రతినిధి శిల్పా ప్రియాంక మాట్లాడుతూ చిట్టమూరు మండలం తిమ్మారెడ్డి వాగుకు చెందిన బాలక్రిష్ణ వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందజేసినట్టు తెలిపారు. అలాగే వరద బాధితులకు సత్యంజీ రియల్ ఎస్టేట్ సంస్థ, గూడూరు పశు వైద్యులు సురేష్ రూ.25 వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు.